క్లుప్తంగా

ప్రాణికోటికి మొక్కలే జీవనాధారం



సిద్ధాంతంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ గనిరాజు

పెనుగొండ: ప్రాణికోటికి మొక్కలే జీవనాధారమని, ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) అన్నారు. మంగళవారం సిద్ధాంతం వాకర్స్ అసోసియేషన్, రిటైర్డు ఉద్యోగులు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. గ్రామంలో 200 మొక్కలు వరకూ నాటుతున్నట్లు తెలిపారు. కాలుష్య నివారణకు, ప్రాణికోటి మనుగడకు మొక్కలే కీలకమన్నారు. కార్యక్రమంలో నక్కా సత్యనారాయణ, టి.రాజారావు, కవులు రమా సత్యనారాయణ, టి.వీర్రాజు, ప్రసాదు, వెన్నపు వెంకటేశ్వరరావు, పల్లి మునియ్య తదితరులు పాల్గొన్నారు

ఏఎంసీ కార్యాలయ పరిశీలన



ఏఎంసీ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

నరసాపురం రూరల్: మండలంలోని సరిపల్లి పరిధిలో ఉన్న ఏఎంసీ కార్యాలయం, గోడౌన్లను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మంగళవారం ఉదయం పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులను అడిగి ఆదాయ వ్యయ వివరాలు, ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారు? వంటి విషయాలను తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు ఆదాయం పెంచుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ దొండపాటి స్వాములు ఉన్నారు.

ఎమ్మెల్యే పితానిని కలిసిన గురుకుల ఉపాధ్యాయులు



ఎమ్మెల్యే పితానితో పెనుగొండ గురుకుల పాఠశాల సిబ్బంది

పెనుగొండ: పెనుగొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరు క్వీనీ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.కొమ్ము చిక్కాలలోని పితాని నివాసంలో పుష్పగుచ్ఛం అందించి పాఠశాల సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. త్వరలోనే పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని మాజీ మంత్రి పితాని భరోసా ఇచ్చారని ప్రిన్సిపాల్ ఎస్తేరు క్వీనీ తెలిపారు.

ఆడపిల్లలను అల్లరి చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి



ఏనుగువానిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో పోలీసులు

పాలకొల్లు అర్బన్: ఆడపిల్లలను ఎవరైనా అల్లరి చేస్తే అప్రమత్తంగా ఉండాలని పాలకొల్లు రూరల్ సీఐ కుడిపూడి సతీష్ అన్నారు. యలమంచిలి మండలం ఏనుగువానిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీస్ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు ఏదైనా ప్రమాదం గానీ, ఎవరినుంచైనా ఇబ్బందులు ఎదురైతే వారిలో వారే కుంగిపోకుండా తల్లిదండ్రులకు, మహిళా పోలీసులకు లేదా 100కి ఫోన్ చేయాలని సీఐ సతీష్ సూచించారు. మగ పిల్లలు ప్రేమిస్తున్నానని, లేదా రకరకాల ప్రలోభాలకు గురిచేస్తుంటారని, వారిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. చదువుపై ధ్యాస పెట్టి బాగా చదువుకుని మంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కె శివన్నారాయణ, పాఠశాల హెచ్ఎం ఎస్ఎస్ అవధాని, సహోపాధ్యాయుడు సీహెచ్ రంగప్రసాద్, ఏఎస్సై ఎస్ దుర్గారావు పాల్గొన్నారు.

పెర్కిపాలెంలో మెడికల్ క్యాంప్

వీరవాసరం: మండలంలోని పెర్కిపాలెంలో మంగళవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టాబ్లెట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేసి, దగ్గు జలుబులాంటి చిన్ని వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బుడగ జంగాల కాలనీ, బీసీ ఏరియా, ఎస్సీ ఏరియాలలో ఐడీసీఎఫ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. తాగునీరు, పరిస రాల పరిశుభ్రతపై జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎస్.చిట్టిబాబు, నాగమణి, భారతి తదితరులు పాల్గొన్నారు.

సార్వా సాగుకు సిద్ధం

- నారుమడులు తయారు చేసుకుంటున్న రైతులు
- నాట్లు వేయడానికి వస్తున్న బెంగాలీ కూలీలు



చిన్నంవారి పాలెంలో నారుమడుల వద్ద రైతు

పెనుగొండ: తొలకరి ప్రారంభంతో రైతన్నలు సార్వాకు సన్నద్ధం అవుతున్నారు. నియోజకవర్గంలో ఆచంట మండలంలో 4500 హెక్టార్లు, పెనుగొండ మండలంలో 5047 హెక్టార్లలోనూ, పెనుమంత్ర మండలంలో 5446 హెక్టార్లలోనూ, పోడూరు మండలంలో 5990 హెక్టార్లలోనూ సార్వా సాగు చేయనున్నారు. నాట్లుకు అవసరమైన ఆకుమడులు 15 రోజులుగా సిద్ధం చేసుకుంటున్నారు. ఆకుమడులు సిద్ధం కావడంతో నాట్లు వేయడానికి సన్నద్ధం అవుతున్నారు. సార్వాకు అత్యధికంగా ఎంటీయూ 1318 రకం, పీఎల్, స్వర్ణ, దాళ్వా సాగు కోసం ఎంటీయూ1121 విత్తన రకాలను సాగు చేస్తున్నారు. అధిక దిగుబడుల నిచ్చే వరి వంగడంగా పేరుగాంచిన ఎంటీయూ 1318 రకంపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు. దాదాపుగా 75 శాతానికి పైగా రైతన్నలు ఎంటీయూ 1318 సాగుకు సిద్ధమయ్యారు. చీడపీడలను తట్టుకోవడంతో పాటు అధిక దిగుబడులు ఇస్తూ గత సీజన్‌లో రైతన్నలను ఆకట్టుకుంది. దీంతో అందరూ ఎంటీయూ 1318 సాగు చేయడానికి ఆకుమడులు వేసుకున్నారు. ఆకుమడులు పూర్తి కావస్తుండడంతో వరి చేలను దమ్ముచేయడంలో నిమగ్నమయ్యారు. ఓ పక్క దమ్ము చేస్తూనే, గట్టులంకలు పటిష్టం చేసుకుంటున్నారు.

బెంగాలీల రాక

వరి సాగులో కీలకంగా మారిన బెంగాలీ కూలీలు రావడం ప్రారంభించారు. తక్కువ నారుమడి ఉపయోగించి, వేగంగా నాట్లు వేయడంలో బెంగాలీలు సిద్ధహస్తులు కావడంతో డెల్టా ప్రాంత రైతన్నలు అందరూ బెంగాలీ కూలీలపైనే ఆధార పడుతున్నారు. వీరు తక్కువ నారుతో ఎక్కువ నాట్లు వేస్తుండడంతో, మూనలు పెరిగి దిగుబడులు పెరుగుతుండడంతో రైతన్నలు అందరూ స్థానికుల కన్నా బెంగాలీలనే నాట్లుకు వినియోగిస్తున్నారు. దీంతో బెంగాలీలు నాట్లు సమయానికి చేరుకుంటున్నారు. ఇప్పటికే వడలి, పెనుగొండ, ఆచంట ప్రాంతాలకు కొందరు బెంగాలీలు చేరుకున్నారు. మరికొందరు త్వరలోనే చేరుకునే అవకాశాలు ఉన్నాయి. దీంతో నాట్లు వేయడానికి దమ్ములు పూర్తి చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు.



వడలిలో దమ్ము చేస్తున్న చేస్తున్న దృశ్యం



వెంకట్రామపురంలో గట్టులంకలు వేస్తున్న రైతన్నలు

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని నరసాపురం 7 ఆంధ్రా నేవల్ యూనిట్ కమాండర్ సి. రోహిత్‌కుమార్ సూచించారు. మంగళవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ, నేవల్ కేడెట్స్ పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్‌కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పూర్తిగా పాడవుతుందని అన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థులకు అలవాటు పడి విద్యార్థులు, యువత జీవితాలను నాశనం చేసుకోకూడదని చెప్పారు. పంజా సెంటర్ నుంచి పట్టణంలోని బస్టాండ్ వరకూ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో నేవల్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మంగళవారం ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో ప్రారంభించిన లక్ష్మీగణపతి హోమంలో 26 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామి వారి శేషవస్త్రం, జాకెటు ముక్కలు, ప్రసాదం అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలన



నడిపూడిలో ప్రజలకు సూచనలు ఇస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలపై ఎంపీడీవో ఎస్ శ్రీనివాస దొర ఆకస్మిక పరిశీలన చేశారు. మంగళవారం మండలంలో వడలి, చినమల్లం, సిద్ధాంతం, పెనుగొండ, నడిపూడిగ్రామాల్లో పరిశీలన చేసి పంచాయతీ సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు చేశారు. వడలిలో వాటర్ ట్యాంకు పైభాగంకు వెళ్లి క్లోరినేషన్, లోపలి పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో వాటర్ టెస్టింగ్‌ను పరిశీలించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటరెడ్డి, మిరియాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత



పాలకమ్మచెరువులో విద్యార్థులతో సర్పంచ్ మేరీ



జిన్నూరు జెడ్పీహైస్కూల్‌లో విద్యాసామగ్రి అందజేస్తున్న నాయకులు



దగ్గులూరులో విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేస్తున్న దృశ్యం

మొగల్తూరు: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విద్యాసామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పడవల మేరీ కోరారు. మొగల్తూరు పంచాయతీ పాలకమ్మచెరువు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం విద్యాకానుక కిట్లను సర్పంచ్ మేరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నక్కా అనిల్ ప్రసంగి, ఉపాధ్యాయుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: ప్రాథమికస్థాయి నుంచి చదువులో రాణిస్తేనే మంచి భవిష్యత్‌కు పునాది పడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు అన్నారు. జిన్నూరు జెడ్పీహైస్కూలులో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యాసామగ్రి కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సీహెచ్.శివజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దిరాజు మాట్లాడుతూ నేటి విద్యార్థులు ప్రభుత్వం, దాతలు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదవాలన్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వెళుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలనీ, పెద్దయ్యాక ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ మాట్లాడుతూ హైస్కూల్, కళాశాల విద్య పూర్తయ్యే వరకు విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్, మండలపరిషత్ మాజీ ఫ్లోర్‌లీడర్ పాలవలస తులసీరావు, యలకల శ్రీనివాస్, రెడ్డి ఆనంద్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కుక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టపర్రులో...

మట్టపర్రు ఏఏ పేట పాఠశాలలో మంగళవారం గ్రామసర్పంచ్ దొమ్మేటి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు, నోట్‌బుక్స్ తదితర విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందనీ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు యల్లమెల్లి వెంకట్రావు, బండి సుదర్శనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దగ్గులూరులో..

పాలకొల్లు అర్బన్: పాఠశాలలు ప్రారంభించిన వెంటనే విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రితో కూడిన స్టుడెంట్ కిట్స్ అందజేయడం అభినందనీయమని మండల పరిషత్ ప్రతిపక్షనేత శాగ సత్యానారాయణ అన్నారు. మండలంలోని దగ్గులూరు నెం.1, నెం.2 ప్రాథమిక పాఠశాలలోని చదువుకుంటున్న 54 మంది విద్యార్థులకు స్టుడెంట్ కిట్స్‌ను మంగళవారం అందజేశారు. గ్రామ సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు, బూట్లు, సాక్స్, బెల్ట్, టైతో కూడిన కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విశ్వనాథం పేరయ్య, టీడీపీ నాయకులు పాముల రజనీకుమార్, కలిదిండి రామచంద్రరాజు, అందే కోటి వీరభద్రం పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న 10వ అదనపు జిల్లా జడ్జి విజయదుర్గ

నరసాపురం: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నామని, ఈ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా సహకరించాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ న్యాయవాదులను కోరారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై మంగళవారం ఆమె బార్ అసోసియేషన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ సివిల్ కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని చెప్పారు. మధ్యవర్తిత్వం వహించి వారిలో అవగాహన పెంచాలని చెప్పారు. క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకోదగిన అన్ని కేసులు పరిష్కారం కావడానికి సహకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో జడ్జిలు జి.గంగరాజు, కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు, కార్యదర్శి ఆర్‌జీ కుమార్ పాల్గొన్నారు.

'రాష్ట్రీయ బాల స్వాస్థ్య'పై అవగాహన సదస్సు

చిన్నారుల్లో లోపాలపై ప్రత్యేక సర్వే



అవగాహన సమావేశంలో పాల్గొన్న జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు

భీమవరం (ప్రకాశంచౌక్): 0–5 ఏళ్ల చిన్నారులకు వచ్చే లోపాలను సర్వే ద్వారా గుర్తించి సంబంధిత పీహెచ్‌సీ వైద్యులకు తెలియజేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు, స్టాఫ్ నర్సులకు మంగళవారం భీమవరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, అంగ వైకల్యం, అభివృద్ధిలో లోపాలు, పోషకాహారం వల్ల వచ్చే వ్యాధులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను స్పెషలిస్టులకు చూపించి మెరుగైన సేవలు అందించాలన్నారు. సమాచారాన్ని ఆర్‌బీఎస్‌కె యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.భావన, వై.వెంకటేష్ పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన సదస్సు



గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: డయేరియాపై ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిని అరుణకుమారి సూచించారు. మండలంలోని గొల్లవానితిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి అరుణకుమారి మాట్లాడుతూ డయేరియా కలుషితమైన ఆహారం, నీళ్లు తీసుకోవడం వలన వస్తుందన్నారు. ఈ వ్యాధి సోకితే అధిక నీళ్ల విరేచనాలతో మనిషి నీరసించిపోతాడన్నారు. వేసవి ముగిసి వర్షాకాలం ప్రారంభమవుతుండటంతో గ్రామాలలో రక్షిత మంచినీటి చెరువులకు కొత్త నీరు పెడతారని వైరల్ జ్వరాలు వస్తాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతేకాకుండా ఇంటింటికి తిరిగి 5 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి త్రాగునీటి సరఫరాలో క్లోరినేషన్, శానిటేషన్ వంటి పనుల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్‌పీహెచ్‌ఈవో కె.అప్పారావు, సూపర్‌వైజర్ జి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఎమ్.శ్యామల



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పురపాలక సంఘ పరిధిలో అతిసారం, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలపై మున్సిపల్ కమిషనర్ ఎమ్.శ్యామల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను క్రమం తప్పకుండా ప్రతీ 15 రోజుల కోసారి శుభ్రం చేయించి, ఎమినిటీస్ సెక్రటరీ ధ్రువీకరణ పత్రాన్ని ఏఈకి అందజేయాలన్నారు. తాగునీటి శాంపిల్స్ ల్యాబ్ పరీక్షలను పర్యవేక్షించాలన్నారు. పట్టణంలోని రోడ్ల వెంబడి చెత్త పోగులు లేకుండా ఎప్పటికప్పుడు వాటి తరలింపునకు శానిటేషన్ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్ లీకేజీలు అరికట్టకపోతే త్రాగునీరు కలుషితమయ్యి, డయేరియా ప్రబలుతుందన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ×స్టాప్ డయేరియా కాంపెయిన్ నినాదంతో ప్రతీ వార్డులో డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని వార్డు సచివాలయ ఏఎన్ఎం, శానిటేషన్ సెక్రటరీలు, ఎమినిటీస్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్, మున్సిపల్ ప్రజారోగ్య, ఇంజనీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంతువుల పరిరక్షణపై వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: జంతువుల సంరక్షణ, పరిరక్షణ మానవత్వంతో కూడిన సామాజిక బాధ్యత అని జిల్లా పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్, ఏడీ సత్యనారాయణ అన్నారు. జిల్లా జంతు సంక్షేమం, పశు సంవర్థక శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జంతు సంరక్షణ, పరిరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా భీమవరం సీవీ రామన్ స్కూల్, పీఎస్ఎం హైస్కూల్లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రెండు పాఠశాలల్లో 52 మంది విద్యార్థులకు పోటీలను నిర్వహించామని, గెలుపొందిన వారికి జూలై 6న జరిగే ముగింపులో బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సరిత, ఎం.సుధారాణి, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, పార్వతి, చిన్మయ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



డెస్కులకు టాప్‌లు లేని దృశ్యం

ఆకివీడు: విద్యార్థులకు అన్ని వసతులూ కల్పిస్తున్నా పాఠశాల యాజమాన్య లోపంతో కనీస వసతులు దూరమవుతున్నాయి. స్థానిక పులవర్తి లక్ష్మణ స్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కొన్ని తర గతిగదుల్లో డెస్కులు అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థులకు తీవ్ర అసౌకర్యం కల్గిస్తున్నాయి. డ్యూయల్ డెస్కులు ఏమైపోయాయో తెలియని దుస్థితి. కొన్ని తరగతి గదుల్లో డెస్కులు లేక విద్యార్థుల బ్యాగ్‌లు, పుస్తకాలు డెస్క్ అరల్లో పెట్టుకుంటున్నారు. రాసుకునేందుకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఎనిమిది, తొమ్మిదో తరగతి గదుల్లో ఈ దుస్థితి ఉందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. మరి కొన్ని తరగతి గతుల్లో డెస్కులకు అర లేక పుస్తకాల బ్యాగ్‌లు కింద పెట్టుకోవలసి వస్తోందని, పుస్తకాలు తీసుకునేందుకు గుంజీలు తీయాల్సి వస్తుందంటున్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు మొదట విడతలోనే డ్యూయల్ డెస్కులు అమర్చారు. తాగేందుకు ఏర్పాటు చేసిన ఆధునిక ఫిల్టర్లు కూడా పని చేయడం లేదు. అన్ని మౌలిక వసతులూ కల్పిస్తున్నా విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎల్ఎంటీ కాలనీలో గంజాయి బ్యాచ్ ఆగడాలు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణ పరిధిలోని పెంకుళ్లపాడు ఎల్‌అండ్‌టీ కాలనీలో గంజాయి బ్యాచ్ ఆగడాలతో ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. కాలనీలో మందుబాబులు మందు తాగి ఖాళీ సీసాలను రోడ్డుపై పగలగొడుతున్నారు. దీంతో మోటార్ సైకిళ్లపై వెళ్లేవారికి, నడచి వెళ్లేవారికి గాజు పెంకులు కాళ్లలో దిగుతున్నాయి. మోటార్‌సైకిళ్ల టైర్లలో దిగిపోయి ప్యాచీలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది యువత గంజాయి తాగుతున్నారని కాలనీ వాసులు చెబుతున్నారు. దీనిపై పోలీసులు నిఘా పెంచి గంజాయి తాగేవారిని అరికట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కల్లుగీత వృత్తిని ఆధునీకరించాలి

భీమవరం: అందుబాటులో ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా కల్లుగీత వృత్తిని ఆధునీకరించి కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి అన్నారు. మంగళవారం భీమవరం డివిజన్ ఆరు మండలాల గీత కార్మికుల విస్తృత స్థాయి సమావేశం సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడలి పాండు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సింహమూర్తి మాట్లాడుతూ కల్లుగీత వృత్తి రక్షణ, ఆధునీకరణ, సంక్షేమం, ఉపాధి, సామాజిక భద్రత కోసం 30 ఏళ్లుగా గీత కార్మిక సంఘం అనేక పోరాటాలు చేసిందని నర్సింహమూర్తి గుర్తు చేశారు. గీత కార్మికులందరికీ ఉచితంగా ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని, పేద గీత కార్మికులకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించి ఇవ్వాలని నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. సమావేశంలో కొండవీటి శ్రీనివాసరావు, కాగిత రాధాకృష్ణ, తుంగ సాయిబాబు, చింతపల్లి చినవీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.